క్లుప్తంగా

ఇంటిస్థల వివాదం.. వ్యక్తిపై చాకుతో దాడి

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరులో ఇంటి స్థల వివాదంపై బోర సూరిబాబు(27)పై మణికంఠ అనే వ్యక్తి బుధవారం సాయంత్రం చాకుతో దాడి చేసి కుడిచేతి పక్కటిముకలు, ఎడమచేతి భుజం కింద గాయపరిచాడు. సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలివి..

ఇరవై ఏళ్ల క్రితం ఇంటి లక్ష్మణరావుకు ఆదిలక్ష్మితో వివాహం కాగా, వారికి కార్తీక్ జన్మించాడు. లక్ష్మణరావు, ఆదిలక్ష్మిల మధ్య మనస్పర్థల కారణంగా ఆదిలక్ష్మి కార్తీక్‌ను తీసుకుని వెళ్లిపోయింది. తర్వాత ఆమె బోర సూరిబాబును రెండో వివాహం చేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో ఆదిలక్ష్మికి లొడగలవానిపాలెం పంచాయతీలో జగనన్న ఇంటి స్థలం కేటాయించారు. ఆ స్థలాన్ని తన పేరున బదిలీ చేయాలని తల్లి ఆదిలక్ష్మిపై కార్తీక్ ఒత్తిడి తీసుకువస్తున్నాడు. ఇందులో భాగంగా బుధవారం కార్తీక్ తన తండ్రి లక్ష్మణరావు, లక్ష్మణరావు మరో భార్య కుమారుడు మణికంఠతో కలిసి లొడగలవానిపాలెంలో ఆదిలక్ష్మి వద్దకు వచ్చారు. ఈ క్రమంలో జరిగిన వివాదంలో మణికంఠ, సూరిబాబుపై చాకుతో దాడి చేయగా కింద పడిపోయాడు. అనంతరం కార్తీక్, లక్ష్మణరావు, మణికంఠ ద్విచక్రవాహనంపై పారిపోయారు. ఆదిలక్ష్మి అంబులెన్స్ సాయంతో భర్త సూరిబాబును కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించింది. ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శివ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దళిత విద్యార్థిపై దాడిని నిరసిస్తూ రాస్తారోకో


తాళ్లవలస సర్వీస్‌రోడ్డులో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

తగరపువలస: చిత్తూరు జిల్లా పుంగనూరులో దళిత విద్యార్థి జేమ్స్‌పై అగ్రవర్ణ విద్యార్థులు కులం పేరుతో దూషించి, కిడ్నాప్ చేయడమే కాకుండా కత్తులతో తలపై, కళ్లపై దాడిని నిరసిస్తూ గురువారం సాయంత్రం దళిత సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. భీమిలి మండలం తాళ్లవలస సర్వీస్‌రోడ్డు వద్ద అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బోని సన్నిబాబు ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర మాలమహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఈ సంఘటనకు కారణమైన వారిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యానేరం కింద మరో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం నామమాత్రంగా కేసు నమోదు చేసి పక్కదారి పట్టిస్తే న్యాయస్థానం సుమోటాగా స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఆదేశాలు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో బెల్లాన అప్పారావు, పోతుబారిక నరసింహారావు, సియ్యాద్రి రాంబాబు, బోని ఆనందరావు, ముత్యాలరావు, శివ, బోని ప్రసాద్, సురేష్‌కుమార్ కడితి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' కార్మికులకు సంఘీభావంగా ర్యాలీ

మధురవాడ: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న కార్మికులపై ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలంటూ, కార్మికులకు సంఘీభావంగా గురువారం మధురవాడలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగి తొలగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు కొండమ్మ, కిరణ్, సంధ్య, సుజాత పాల్గొన్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

డాబాగార్డెన్స్: సరస్వతీ నది పుష్కరాలకు ఏపీఎస్‌ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విశాఖ నుంచి పలువురు ప్రయాణికులు, భక్తులు గురువారం బయలుదేరగా, జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు ద్వారకాబస్టేషన్ వద్ద ఇంద్ర ఏసీ బస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ ప్రయాణికులు పూర్తి బస్సును బుక్ చేసుకోవాలన్నా, విడివిడిగా టికెట్లు కావాలన్నా ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం, శనివారం ద్వారకాబస్టేషన్ నుంచి బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సులకు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో apsrtc. com వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 8309265666, 905222 70 83,9959225594 నంబర్లలో సంప్రదించవచ్చు.

రోడ్డు మధ్య విద్యుత్ స్తంభాలు

అసలే ఇరుకు రోడ్లు.. దానికితోడు విద్యుత్ స్తంభాలు.. దీంతో యాతపేట వాసులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసరమైతే కనీసం అంబులెన్స్ గానీ, ఫైర్ ఇంజిన్ గానీ వెళ్లలేని పరిస్థితి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లాలన్నా అవస్థలే.

యాతపేట వాసుల అవస్థలు


యాతపేట శివారులో ఇంటిని ఆనుకుని తుప్పు పట్టి, వాలిన స్తంభం


హైవేను ఆనుకుని బాలాజీనగర్‌లో రహదారి మధ్య స్తంభం


అంగన్వాడీ కేంద్రం నాలుగు రోడ్ల కూడలి మధ్య విద్యుత్ స్తంభం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బాలాజీనగర్ సమీప యాతపేటలో ఇరుకైన సీసీ రోడ్ల మధ్య విద్యుత్ స్తంభాలతో స్థానికులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని వేగంగా అభివృద్ధి చెందిన బాలాజీనగర్, యాతపేటలో స్థానికులతో పాటు బయటి వ్యక్తులు విశాలమైన ఇళ్లు నిర్మించుకున్నారు. తరువాత కాలంలో భీమిలి మున్సిపాల్టీ నుంచి వీధిదీపాలు, అనం తరం సీసీ రోడ్లు నిర్మించారు. దీంతో ప్రస్తుతం ఇళ్లకు చేరుకోవడానికి విద్యుత్ స్తంభాలు ఆటంకంగా మారాయి. తుప్పు పట్టిన వాలిపోయిన స్తంభాలతో పాటు గాలులు వీచినప్పుడు ఇళ్ల మధ్య తెగిపడిన విద్యుత్ వైర్లను తలచుకుంటూ ఇక్కడి వారు ఏళ్ల తరబడి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలాజీనగర్ వరకు బాగానే ఉన్నా ఇరుకైన రహదారులతో ఉన్న యాతపేటలోనే జీవీఎంసీ, విద్యుత్‌శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాటు చేపట్టి సురక్షిత విద్యుత్ మార్గాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జాతీయరహదారి, శ్రీబాసర లే అవుట్, గోస్తనీనది పరీవాహక ప్రాంతం, బాలాజీనగర్ గ్రామాల మధ్య ఉన్న యాతపేటలో సుమారు 250 కుటుంబాల వారు నివసిస్తున్నారు. విద్యుత్ స్తంభాల అడ్డంకి కారణంగా కార్లు, ఆటోలపై ఇళ్ల వద్దకు చేరుకోలేకపోతున్నారు. చీకటి పడితే ద్విచక్రవాహనాలు కూడా ఈ ఇరుకైన రహదారుల మధ్య స్తంభాల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు నడిరోడ్డుపై విద్యుత్ స్తంభాల ముప్పును తప్పించాలని స్థానికులు కోరుతున్నా పరిష్కారమార్గం కనిపించడం లేదు. స్తంభాల మధ్య న్యూట్రల్, వీధి దీపాలు, ఇళ్లకు సంబంధించి మూడు వైర్లకు బదులుగా రక్షణ కోసం తాత్కాలికంగా ఏబీ కేబుల్ వేయాలని కోరుతున్నారు.


శ్రీబాసర కళాశాల వైపు రహదారి మధ్య స్తంభం

ప్రమాదం జరిగితే ..!

వర్షాకాలంలో తీవ్రమైన గాలులు వీచినప్పుడు విద్యుత్ వైర్లు పరస్పరం కలిసిపోయి నిప్పులు రావడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు, తడిచిన ఐరన్ స్తంభం నుంచి విద్యుత్ ప్రసారం వంటివి జరుగుతున్నాయి. ప్రమాదం గ్రహించలేని చిన్నారులు, మద్యం సేవించిన వారు ఈ ముప్పు ఉన్న ఐరన్ స్తంభాలను తాకినా, విద్యుత్ వైర్లు తెగిపడినా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

అత్యవసర వేళ వాహనాలు వెళ్లలేని స్థితి..

యాతపేటలో అగ్నిప్రమాదాలు, మరే ఇతర ప్రమాదాలు జరిగినా అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు ప్రవేశించే అవకాశం లేకుండా రహదారుల మధ్య స్తంభాలు ప్రధాన ఆటంకంగా ఉంటున్నాయి. అంతేకాకుండా యాతపేట గ్రామం లోపలికి చేరుకోవడానికి చుట్టుపక్కల నుంచి కూడా సరైన మార్గాలు లేకుండా మూసుకుపోయాయి. భవిష్యత్తులో యాతపేట చుట్టూ నిర్మాణాలు చేపడితే ఇప్పుడు ఉన్న మార్గాలు కూడా మూసుకుపోయే ప్రమాదం ఉంది. అందువలన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రహదారుల మధ్య ఉన్న స్తంభాలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని జీవీఎంసీ, విద్యుత్‌శాఖ అధికారులను కోరుతున్నారు.

వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలి



యాతపేట గ్రామం మధ్యలోకి ఎలాంటి వాహనం రావాలన్నా సమస్య అవుతోంది. రహదారిపై స్తంభాలు అడ్డంకిగా ఉన్నాయి. దీంతో గ్రామస్తులంతా ఇబ్బంది పడుతున్నారు.

– సంపంగి అప్పారావు, యాతపేట

అసలే ఇరుకైన సందులు..



వాస్తవానికి యాతపేటలో ఇరుకైన సందుల కారణంగా ఏ వాహనం రాలేదు. కాస్తా కూస్తో బాలాజీనగర్ లేదా జాతీయ రహదారి వరకే మార్గం ఉంది. ఇల్లు మారాలన్నా, ఇంటి నిర్మాణం చేపట్టాలన్నా శివారులో వాహనాలు నిలిపి సామాన్లు మోసుకోవాలి.

– చొప్పా శ్రీనివాసరావు, యాతపేట

బాసర లే అవుట్‌లో నిర్మాణాలు చేపడితే కష్టమే..



ప్రస్తుతం బాసర లే అవుట్ నుంచి మాత్రమే యాతపేటలోకి తేలికగా చేరుకోవచ్చు. బాలాజీనగర్ పూర్తిగా పల్లపు ప్రదేశంలో ఉంది. అందువలన ఎక్కువ వాహనాలు రావు. బాసర లే అవుట్ వైపు నిర్మాణాలు పెరిగితే యాతపేటకు రాకపోకలు ఇంకా కష్టమవుతాయి.

– పందిరి విజయ్, యాతపేట

నవధాన్యాల సాగుతో నేల సారవంతం


రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకాష్

పద్మనాభం: నవ ధాన్యాలను సాగు చేయడం వల్ల, నేల ఆరోగ్యవంతంగా ఉండి పంటలు బాగా పండుతాయని నార్త్ కోస్టల్ ప్రకృతి వ్యవసాయం టెక్నికల్ లీడ్ ప్రకాష్ తెలిపారు. మండలంలోని కోరాడ, కురపల్లి గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ వేసవి దుక్కుల్లో నవ ధాన్యాలు వేయాలన్నారు. దీనిలో భాగంగా రైతులకు నవ ధాన్యాల కిట్లు పంపిణీ చేశారు.

25న గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశ పరీక్ష


వివరాలు తెలుపుతున్న డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల్లో నిర్వహిస్తున్న యూజీ, పీజీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యూజీ స్థాయిలో బీకాం, బీబీఏ, జనరల్ బీబీఏ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. పీజీ స్థాయిలో ఎంబీఏతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్, అకాడమీ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

శ్రీ ఆంజనేయం

- అంజనానుతుడికి ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి


సంగివలస అభయాంజనేయస్వామి ఆలయంలో 10వేల తమలపాకులతో పూజ చేస్తున్న అర్చకుడు


భీమిలి దాసాంజనేయస్వామి ఆలయంలో ..


మజ్జివలసలో తమలపాకులతో ఆంజనేయస్వామికి అలంకరణ


హనుమాన్ అలంకరణలో బబ్బేలమ్మ


విశేష అలంకరణలో చంద్రంపాలెం పంచముఖ ఆంజనేయస్వామి


తర్లువాడ ఎస్సీ కాలనీలోని ఆలయంలో పూజలు చేస్తున్న మజ్జి వెంకటరావు

తగరపువలస: హనుమజ్జయంతి వేడుకలను నియోజకవర్గంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొండపేటలో అర్చకుడు బొల్లాప్రగడ రమణమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు అన్నసమారాధన నిర్వహించారు.

◆ సంగివలసలో అర్చకుడు ఆదిత్యశర్మ 10వేల తమలపాకులతో అర్చన, అన్నదానం చేశారు. సాయంత్రం గుర్రాల రథంపై స్వామివారిని ఊరేగించారు.

◆ చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో జీరు వెంకటరెడ్డి, సుంకర రామ్‌కుమార్, రాజు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి నిర్వహించారు.

◆ మజ్జివలసలో ఆంజనేయస్వామిని మాలధారులు తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం 24 గంటల పాటు హరేరామ నామసంకీర్తన నిర్వహించి, 3వేల మందికి అన్నదానం చేశారు.

◆ చిల్లపేట వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు, బైటో భజన కార్యక్రమాలతో పాటు 1500 మందికి ప్రసాదాలు పంపిణీ చేశారు. అంబేడ్కర్ కూడలి వద్ద ఆలయంలో నిర్వాహకులు జయరాం అన్నదానం చేశారు.

◆ ఆనందపురం మండలం తర్లువాడ ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు ఆధ్వర్యంలో పూజలు, అన్నదానం నిర్వహించారు. గుడిలోవ విజ్ఞాన విహార్ ఆవరణలోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సిందూర, కుంకుమార్చనలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

పంచముఖ ఆంజనేయునికి విశేష పూజలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. తులసి మాల లు, పండ్లు, పూల మాలలు, వడలు, గారెలు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పిళ్లా రమణ, లక్ష్మి దంపతుల సహకారంతో 500 మూరల తులసిమాలలతో అలంకరించారు. హనుమ, శ్రీరామ సంకీర్తనలతో బైటో భజన నిర్వహించారు. 500మందికి అన్నప్రసాదం అందించారు.

హనుమగా బబ్బేలమ్మ

పీఎం పాలెం: కారుషెడ్ కూడలికి సమీపంలోని బబ్బేలమ్మ ఆలయంలో అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు కిరణ్‌కుమార్ శర్మ ఆంజనేయస్వామి అలంకరణలో తీర్చిదిద్దారు.

◆ శృంగేరి శంకర మఠంలోని ఆంజనేయ స్వామిని పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో..

భీమునిపట్నం: భీమిలిలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. శ్రీరామనామ సంకీర్తనం , హనుమాన్ చాలీసాతో ప్రాంగణం మార్మోగింది.

హనుమాన్ జెండాల పంపిణీ

కొమ్మాది: కె.నగరపాలెం యూత్ ఆధ్వర్యంలో 1001 హనుమాన్ జెండాలను గురువారం పంపిణీ చేశారు.

రామాద్రిలో.. : మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో హనుమాన్ జయంతి నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, సహస్ర సిందూర, సహస్ర తమలపాకుల అర్చనలు చేశారు. సాయంత్రం 5 గంటలకు హనుమాన్ చాలీసా పఠించారు.

హనుమాన్ శోభాయాత్ర

పద్మనాభం: పద్మనాభంలోని అభయాంజనేయ స్వామి ఆలయాన్ని పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం , గాడు అప్పలరాజు పూజలు చేశారు.

◆ రెడ్డిపల్లిలోని కృష్ణ చంద్ర బాబాజీ మఠం నుంచి హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు.


జెండాలను పంపిణీ చేస్తున్న యువకులు


కొండపేట ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు


పద్మనాభం జంక్షన్‌లో శోభాయాత్ర చేస్తున్న హనుమాన్ భక్తులు

రూ.1,000 కోట్ల వ్యవసాయ రుణాలు లక్ష్యం

పద్మనాభం: తమ రీజియన్ పరిధిలో రైతులకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.1000 కోట్ల వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామని యూనియన్ బ్యాంక్ డీజీఎం ఆర్.నరసింహకుమార్ తెలిపారు. రైతులకు, వ్యవసాయ స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాల మంజూరుపై పద్మనాభం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు తమ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను నిర్ణీత సమయంలోగా చెల్లిస్తే సబ్సిడీ వర్తిస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల గ్రూపునకు రూ.20లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. వ్యక్తిగతంగా అయితే ఒక సభ్యురాలికి రూ.1లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణం మంజూరు చేయనున్ననట్టు చెప్పారు. మద్ది, కృష్ణాపురానికి చెందిన విశాఖ డెయిరీ రైతులు 55 మందికి రూ.58 లక్షలు, 34 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.3.50కోట్ల రుణాల మెగా చెక్కులను ఎంపీపీ కంటుబోతు రాంబాబుతో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ సత్యంనాయుడు, ఏపీఎం సాయి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకులు కాళ్ల నగేష్ కుమార్, కాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.


స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెగా చెక్కును పంపిణీ చేస్తున్న డీజీఎం, ఎంపీపీ

అడుగడుగునా అతిక్రమణలు


అనుమతి లేకుండా నిర్మిస్తున్న పై ఫ్లోర్ సెంట్రింగ్

- నామమాత్రంగా తొలగింపులు


అదనపు ఫ్లోర్‌కు అనుమతి లేని సెంట్రింగ్ తొలగిస్తున్న ప్లానింగ్ సెక్రటరీ, ఇతర సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెంలో నిబంధనలను అతిక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నారు. అనుమతి లేకుండా అదనపు ఫ్లోర్‌నే నిర్మించి.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా .. అధికారుల నామమాత్రపు స్పందన విమర్శలకు తావిస్తోంది

పరదేశిపాలెం రెవెన్యూ గ్రామ సర్వే నంబరు 97/1, 97/3లో సుమారు 700గజాల విస్తీర్ణంలో ఓల్డేజ్ హోమ్ పేరుతో ఒక భారీ భవనం నిర్మిస్తున్నారు. మారికవలస గెడ్డను ఆనుకుని నిర్మాణం చేస్తున్న దీనికి కనీసం బఫర్ జోన్, సెట్ బ్యాక్స్ వంటివి పూర్తిగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ నిర్మిస్తున్న అదనపు ఫ్లోర్‌కు అనుమతులు, ప్లాన్ లేదని ప్లానింగ్ సెక్రటరీ దివ్యభారతి ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి సెంట్రింగ్ పాక్షికంగా తొలగించి మమ అనిపించి.. ఫోన్ రావడంతో చల్లగా జారుకున్నారు. అయితే దీనికి అదనపు ఫ్లోర్‌కు దరఖాస్తు చేసుకున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు.

నిర్మాణంలో ఉన్న భవనంలోనే ఓల్డేజ్ హోం?

ఏ రకమైన అతిక్రమణలు లేకపోతే ఎవెక్షన్ సిబ్బంది సెంట్రింగ్ ఎందుకు తొలగించారు? దరఖాస్తు చేసుకుంటే పనులు చేసేసుకోవచ్చా? బఫర్ జోన్, సెట్ బ్యాక్స్ పరిస్థితి ఏమిటన్నది అధికారులే సెలవివ్వాలి. పైగా నిర్మాణంలో ఉన్న భవనంలోనే ఓల్డేజ్ హోం నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి, వాస్తవాలు నిగ్గు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా మాస్టర్‌ప్లాన్ రోడ్డు

మధురవాడ: మధురవాడ జోన్ పరిధిలో పలు చోట్ల మాస్టర్ ప్లాన్, ఇతర రోడ్లపై ఆర్‌సీసీ మెటీరియల్ జారిపడడంతో గ్రావెల్ రోడ్డుకంటే అధ్వానంగా తయారవుతున్నాయి. ఈ ప్రాంతంలో పరదేశిపాలెం, మారికవలస ప్రాంతాల్లో ఈ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల వాహనాలు వెళ్లేటప్పుడు ఆర్‌సీసీ మిశ్రమాన్ని రోడ్లపై, రోడ్డు పక్కన ఇష్టానుసారం పడేస్తున్నారు. జీవీఎంసీ 8వ వార్డులోని లా కాలేజీ – మిథిలాపురి వుడా కాలనీ రోడ్డుతో పాటు ఐటీ సెజ్‌కు వెళ్లే రోడ్లు కొన్ని నెలలుగా గలీజుగా దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్లను అస్తవ్యస్తంగా తయారు చేస్తున్న వారిపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.


ఆర్‌సీసీ మిక్సింగ్ మెటీరియల్ పడి అస్తవ్యస్తంగా ఉన్న మాస్టర్ ప్లాన్ రోడ్డు